# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 03-05-2017**

విద్యుత్ శాఖ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఒకే సారి భారి ఎత్తున ఉద్యోగాల నియామకాల కోసం ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు మగళవారం ఆమోదం తెలిపారు. 2012 నుంచి విద్యుత్ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరినా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అప్పటి నుంచి ఉన్న ఖాళీలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ఒకేసారి నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల పరిధిలో జూనియర్ లైన్‌మెన్ నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకు మొత్తం 13,357 ఖాళీలను గుర్తించారు. ఇందులో 1,500 వరకు నాన్ టెక్నికల్ పోస్టులు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని ఆదేశించిన సీఎం, ఈ ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో విద్యుత్ శాఖలోని దాదాపు 10వేల మందికి వెంటనే పదోన్నతులు కూడా ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ రంగంలో తెలంగాణ ఎంతో వేగంగా ముందుకు పోతున్నదని, పరిశ్రమలు, గృహ, వాణిజ్య అవసరాలకు 24గంటల పాటు విద్యుత్ అందిస్తున్నామని సంతృప్తి వ్యక్తం చేశారు.

వచ్చే ఏడాది నుంచి వ్యవసాయానికి కూడా 24గంటల విద్యుత్ అందించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. రాష్ట్రం విద్యుత్ సంక్షోభ దశను దాటి మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారుతున్న క్రమంలో విద్యుత్ శాఖను బలోపేతం చేసేందుకే ఇంత పెద్ద ఎత్తున నియామకాలకు అనుమతి ఇస్తున్నామని సీఎం చెప్పారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్‌కు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

**సిపిఆర్ఓ టు సిఎం**